క్లుప్తంగా

సినిమా ఎగ్జిబిటర్లతో చర్చలు జరపండి

తెనాలిఅర్బన్: జూన్ ఒకటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో సినిమా ప్రదర్శనను ఎగ్జిబిటర్లు నిలిపివేస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సినీ పరిశ్రమ పెద్దలు చొరవ చూపి వారితో చర్చలు జరపాలని మా ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. తెనాలిలోని మా ఏపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిటర్లు తీసుకోనున్న నిర్ణయం వలన ప్రజలకు వినోదం దూరమయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సభ్యులు అమీర్ చౌదరి, బసవరత్న పాల్గొన్నారు.

జీవో నెంబర్ 523ను వెంటనే రద్దు చేయాలి

తెనాలిఅర్బన్: జీవో నెంబర్ 523ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ తెనాలి పట్టణ అధ్యక్షుడు షేక్ జానీబాషా డిమాండ్ చేశారు. సోమవారం తెనాలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 523 వలన ఉద్యోగులకు అనేక ఇబ్బందులు ఉన్నాయని ఆరోపించారు. ఉద్యోగులకు ఉన్న అనుమానలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని కోరారు. అలాగే సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని, సర్వీసు రూల్స్ ఏర్పాటు చేసి ఉద్యోగులకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కార్యదర్శి కె.ధర్మసాయి, అజయ్, భాస్కర్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే శిక్షార్హులే



తెనాలి: ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం ఈనెల 20న జరగనున్న సందర్భంగా లీగల్ మెట్రాలజీ ఆంధ్రప్రదేశ్ కంట్రోలర్ సౌరభ్‌గౌర్ ఆదేశాలపై 8వ తేదీ నుంచి వర్తక సంఘాలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఏపీఎస్‌ఆర్టీసీ తెనాలి బస్టాండులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో వ్యాపారస్తులు, వినియోగదారులకు ప్యాకేజీ కమాడిటిస్ లీగల్ మెట్రాలజీ శాఖ రూల్స్-2011 గురించి తెనాలి లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ బి.శేషసాయి అవగాహన కల్పించారు. తినుబండారాలు, కూల్‌డ్రింకులు ఎమ్మార్పీ ధరలకన్నా ఎక్కువ అమ్మితే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. లీగల్ మెట్రాలజి సిబ్బంది, ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

జులై 5న జాతీయ లోక్ అదాలత్

తెనాలిరూరల్: జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో మార్చి జులై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు మండల న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, తెనాలి పోక్సో న్యాయస్థానం స్పెషల్ జడ్జి ఎం. ఇందిరాప్రియదర్శిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల సివిలు, భరణం, బ్యాంకు దావాలు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

యువతితో అసభ్య ప్రవర్తన

తెనాలిరూరల్: తనను పెళ్లి చేసుకోవాలంటూ యువతితో యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన యువకుడు బషీర్ ఆదివారం సాయంత్రం అదే కాలనీకి చెందిన యువతి ఇంటికి వెళ్లి తనను పెళ్లి చేసుకోవాలంటూ అసభ్యంగా ప్రవర్తించాడు. యువతి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అతనిపై త్రీ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

బాధితురాలికి తహసీల్దార్ ఆర్థిక సాయం



తెనాలిరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలికి తక్షణసాయంగా రూ. ఐదు వేల నగదు, బియ్యం, నిత్యావసరాలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సోమవారం అందజేశారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక చెంచుపేట కోనేరు వారి వీధికి చెందిన ఒంటరి మహిళ ఆవులూరి శాంతమ్మ రోడ్డు మార్జిన్ లో నిమ్మకాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంది. ఈ నేపథ్యంలో ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆమెను పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని అధైర్య పడాల్సిన పనిలేదని భరోసా కల్పించారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

బాలింతకు భరోసా ఏది?

'ఈ లోకమనే గుడి చేరగ తొలివాకిలి అమ్మ' అని జగనన్న పాలన భావన చేసింది. కన్నబిడ్డ ఎక్కడ ఎండవేడికి తల్లడిల్లిపోతాడోనని తన పవిట కొంగుని ఛత్రంగా చేసి చల్లదనాన్ని చ్చేది అమ్మే. అలాంటి అమ్మ.. ప్రసవమై బిడ్డతో ఇంటికి సుఖంగా ఇంటికి చేరాలన్న సంకల్పానికి ఇవాళ విఘాతం కలుగుతోంది. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవమైన మాతృమూర్తులు సుఖంగా ఇంటికి చేరుకునేలా చక్కని వాహనాలనూ సమకూర్చింది. అయితే ఆ.. అమ్మలను తీ సుకువెళ్లే వాహనాలు మరమ్మతులకు గురైనాయి.. నిర్వహణ కరువై మూలకు చేరిపోతు న్నాయి తెనాలిలో....

- పేరుకు అయిదు తల్లిబిడ్డ వాహనాలు
- అందులోపనిచేసేది రెండే
- ఆరు నెలల నుంచి తెనాలిలో ఇదే పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న బాలింతలు



మార్కెట్ యార్డులో తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాలు



బాలింతను ఇంటికి క్షేమంగా తీసుకువెళ్తున్న వాహనాలు

తెనాలిఅర్బన్: తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు గ్రహణం పట్టింది. తెనాలి పట్టణానికి అయిదు వాహనాలను ప్రభుత్వం కేటాయించిన వాటిలో పనిచేసేది రెండే. దీంతో జిల్లా వైద్యశాలలో ప్రసవించిన బాలింతలు వాహనం కోసం గంటల కొద్ది వేచి ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవించిన వారిని ఇంటికి చేర్చేందుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రవేశపెట్టింది. వీటి నిర్వాహణ బాధ్యతను సీవీకె ఈఎంఆర్‌ఐ సంస్థకు అప్పగించింది. ఆ సమయంలో తెనాలి జిల్లా వైద్యశాలకు నాలుగు వాహనాలు పంపారు. జిల్లా వైద్యశాల ఆవరణలోని తల్లిపిల్లల వైద్యశాలలో ప్రసవించిన బాలింతలను వైద్యులు డిశ్చార్జి చేయగానే సిబ్బంది తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌కు సమాచారం ఇస్తారు. అతడు వైద్యశాలకు వచ్చి బాలింతను తన ఇంటి వద్దకు తీసుకువెళ్ళి దించి వస్తారు. ఇలా జరుగుతుండగా తెనాలిలోని వాహనాలు ఒక్కొక్కటీ పాడైపోతు వచ్చాయి. 2022 సంవత్సరంలో ఒక్క వాహనంకు పరిమితమైంది.

జీవం పోసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

తెనాలిలోని తల్లిపిల్లల వైద్యశాలలో సగటున నెలకు 200 నుంచి 250 మంది ప్రసవిస్తుంటారు. రోజుకు సగటున అయిదు నుంచి పది మంది డిశ్చార్జి అవుతుంటారు. వీరిలో ఎక్కువ మంది పేదలు కావటంతో వీరందరు తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో వారి స్వస్థలాలకు వెళ్తుంటారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు పాడైపోయి బాలింతలు ఇబ్బందులు పడుతున్న విషయం పాలకుల దృష్టికి వచ్చింది. వెంటనే స్పందించిన ప్రభుత్వం తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ నూతన వాహనాలను కొనుగోలుచేసి రాష్ట్రంలోని అన్ని పట్టణాలకు పంపింది. దీనిలో భాగంగా తెనాలికి అయిదు వాహనాలు వచ్చాయి. దీంతో బాలింతల వెతలు తీరినట్లు అయ్యింది.

పేరుకు అయిదు – పనిచేసేది రెండే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెనాలిలో ఉన్న అయిదు వాహనాలలో ఒకదానిని గుంటూరు పంపారు. మిగిలిన నాలుగు వాహనాలు కొద్ది నెలలు పనిచేశాయి. వేతనాలు సకాంలో చెల్లించకపోవటం తక్కువ వేతనం ఇస్తుండటంతో ఇద్దరు డ్రైవర్లు విధుల నుంచి తప్పుకున్నారు. ఇలా జరిగే ఆరు నెలలు దాటిన నేటికి డ్రైవర్ల నియామకం జరగలేదు. చేసేదిలేక అందుబాటులో ఉన్న రెండు వాహనాలు బాలింతలను స్వస్థలాలకు చేర్చుతున్నాయి. అనుకోకుండా వాహనాలకు రిపేరు వస్తే బాలింతల వేతలు వర్ణనాతీతమనే చెప్పవచ్చు. ఆ సమయంలో కొందరు బాలింతలు ఆటోలను, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆర్థిక స్థోమత లేని వారు అక్కడే వాహనాల కోసం గంటల కొద్ది వేచి ఉండి అవి వచ్చాక స్వస్థలాలకు వెళ్తున్నారు. ఇది ఇలా ఉంటే ప్రస్తుతం వాహనాల నిర్వహణ బాధ్యతలు చూస్తున్న అరవిందో సంస్థ మూడు, నాలుగు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తుందని పలువురు డ్రైవర్లు ఆరోపించారు. ప్రతి నెలా వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. అది ఇలా ఉంటే డ్రైవర్లకు నెలకు రూ.17,800 మాత్రమే ఇస్తుండటంతో వాహానాలలో పనిచేసేందుకు ఎవరు ముందుకు రావటం లేదు. ఇప్పటికైన పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన నిర్వహణలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

వాహనాలన్నీ అందుబాటులోకి తెస్తాం



తెనాలి పట్టణంలోని తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహ నాలు ప్రస్తుతం రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన రెండు డ్రైవర్లు లేక వాటి సేవలు నిలిచిపోయిన విషయం నా దృష్టికి వచ్చింది. డ్రైవర్లను నియమించే విధంగా చూడాలని ఉన్నతాధికారులను కోరడం జరిగింది. త్వరలో డ్రైవర్ల నియామకం జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. వారు రాగానే మిగిలిన రెండు వాహానాల సేవలను పునఃప్రారంభిస్తాం.

– డాక్టర్ అన్నపూర్ణ,
డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో, తెనాలి

మురుగు కాల్వలు ప్రతిరోజు శుభ్రం చేయండి

మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న



కాల్వలను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. సత్యనారాయణ టాకీస్ రోడ్డు, మెయిన్ రోడ్డులో సోమవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించకపోవడం వలన మురుగు సమస్య ఏర్పడుతుందని తెలిపారు. కార్మికులు ప్రతిరోజు కాల్వలోని వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోండి



క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

తెనాలిఅర్బన్: పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని విశ్రాంత గ్రంథాలయాధికారి ముచ్చ్వా సుబ్బారావు పేర్కొన్నారు. నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు చదివే అలవాటును పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి ఖాళీ సమయంలో గ్రంథాలయాన్ని సందర్శించే అలవాటును చేసుకోవాలన్నారు. గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఎస్.లావణ్య సుధ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విజ్ఞాన శిబిరం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులందరూ దీనిలో పాల్గొన్నారు. అనంతరం ముచ్చ్వా సుబ్బారావు, అహ్మద్ హుస్సేన్, బొల్లిముంత కృష్ణ మాస్టార్‌లు యోగా, ధ్యానం, పాటలు వంటి వాటిని నేర్పించారు. చెస్, క్యారమ్స్, సూడో, స్కిపింగ్ వంటి వాటిని విద్యార్థులతో ఆడించారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టర్‌కు తహసీల్దార్ అభినందన



షబీనాను అభినందిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, అధికారులు

తెనాలిరూరల్: ఏషియన్ యూనివర్సిటీ కప్‌లో పవర్ లిఫ్టింగ్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన తెనాలికి చెందిన షేక్ షబీనాను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. కేఎల్ యూనివర్సిటీలో చదువుతున్న షబీనా ఇటీవల డెహ్రాడూన్ లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌తో గోల్డ్ మెడల్‌ను, 84 కేజీల విభాగంలో స్క్వాడ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్టితో మూడు గోల్డ్ మెడల్స్, చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆమెను అభినందించిన తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటికి అంతర్జాతీయ స్థాయిలో నాలుగు, జాతీయ స్థాయిలో రెండు, 20కి పైగా రాష్ట్ర సాయిలో మెడల్స్ సాధించి తెనాలి కీర్తిని ప్రపంచంలో చాటుతోందని ప్రశంసించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావడంతో ఇటీవల జిల్లా కలెక్టర్‌కు కూడా లేఖ రాసినట్లు చెప్పారు. దాతలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆమె క్రీడా నైపుణ్యాన్ని బలపరిచేందుకు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో షబీనా తండ్రి బుజ్జి, కుటుంబ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు

రేపల్లె : సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. తమ భూమి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ ఎడ్లపల్లి గ్రామానికి చెందిన లింగినేని కృష్ణమూర్తి, రేపల్లె మండలం సింగుపాలెం గ్రామానికి చెందిన యార్లగడ్డ రుక్మిణమ్మ, యార్లగడ్డ చంద్రశేఖరరావు, యార్లగడ్డ మదన్ మోహనరావులు అర్జీలు ఇచ్చారన్నారు. తన భూమికి రీ సర్వే చేసిన సర్టిఫికెట్‌ను అందించాలని భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామానికి చెందిన బస్సు గోవిందు అర్జీ ఇచ్చారన్నారు. పెనుమూడిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని అదే గ్రామానికి చెందిన అవనిగడ్డ గంగాధర్ అర్జీ ఇచ్చాడన్నారు. తమ సొంత భూమి వివరాలు దేవదాయ ధర్మదాయ శాఖ భూములలో నమోదయ్యాయని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని 14వ వార్డుకు చెందిన పిల్లి రాజేంద్రప్రసాద్, వెంకటకృష్ణలు అర్జీ ఇచ్చారన్నారు. రీ సర్వేలో తమకున్న ఎకరం 10 సెంట్ల భూమిలో మూడున్నర సెంట్లు తగ్గిందని సమస్యను పరిశీలించి రీ సర్వే చేసి తమ మూడున్నర సెంట్ల భూమిని తమ పొలంలో కలపాలని కొల్లూరు మండలం పోతార్లంక గ్రామానికి చెందిన నాదెండ్ల అరుణ కుమారి అర్జీ చేసిందన్నారు. ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రారంభమైన పదోవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

తెనాలిఅర్బన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు పరీక్ష జరిగింది. మొదటిరోజు తెలుగు పరీక్ష జరిగింది. ఉదయం 9 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతించారు. తెనాలిలో ఎన్‌సీఆర్‌ఎన్ఎంహెచ్ స్కూల్, కెవిఎంహెచ్ స్కూల్, బాయ్స్ హైస్కూల్, గరల్స్ హైస్కూల్, ఏఎస్‌ఎస్ఎం‌స్కూల్‌లను పరీక్ష కేంద్రాలుగా అధికారులు ప్రకటించారు. మొదటి రోజు ప్రశాంతంగా జరిగిందని ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ తెలిపారు.

ప్రపంచం గుర్తించిన కమ్యూనిస్టు సుందరయ్య

తెనాలి: సీపీఎం తెనాలి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం,అగ్రనాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు ఎస్.సుబ్రహ్మణ్యం సుందరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సుందరయ్యకు జోహార్లు అర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. పార్టీ నాయకుడు కేబీ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రపంచం గుర్తించిన అతికొద్దిమంది కమ్యూనిస్ట్ నాయకుల్లో సుందరయ్య ఒకరని గుర్తుచేశారు. పార్టీ నాయకులు షేక్ హుస్సేన్‌వలి, జె.శ్యామ్, ములకా శివసాంబిరెడ్డి, జి.రవీంద్ర, వై.అశోక్‌కుమార్ మాట్లాడారు. శెట్టి ఏసోబు, కె.దుర్గాప్రసాద్, కుర్రా వెంకటరమణ, సంగమేశ్వరరావు, దార్ల పద్మ, కస్తూరి, మరియమ్మ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని చిగురు గ్రామంలో పిల్లల కోసం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో సోమవారం సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ మేనేజర్ వసంత కుమారి మాట్లాడుతూ.. 2025 సంవత్సరానికి రెస్పాన్సిబిలిటీ అనే థీమ్‌ను ఎంచుకుని ఈ క్యాంప్‌లో పిల్లలందరికీ డ్యాన్స్, క్రాఫ్ట్ వర్క్‌లో శిక్షణ ఇచ్చామని తెలిపారు. సుమారు 45 మంది విద్యార్థులు శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంటేషన్ ఇన్‌చార్జి శ్రవణ్ కుమార్, నర్స్ సునీత, లెర్నింగ్ టీచర్లు దుర్గ, తిరుపతమ్మ, సుజాత, స్వర్ణగౌరి, సంధ్య, చంద్రిక, శిరీష, ప్రియాంక, లావణ్య పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి అరటి పూల పూజ



జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఏకాదశి దీక్షతో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా సోమవారం స్వామి వారికి అరటి పుష్పాలతో విశేషంగా పూజ నిర్వహించారు. మన్నె శివ వెంకటేశ్వరరావు దంపతులు సుప్రభాత సేవ అనంతరం పంచామృత అభిషేకం జరిపించి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం స్వామి వారికి అష్టోత్తర సహస్ర నామాలతో అరటి పుష్పాల మాలలను అలంకరించి పుష్పాలతో విశేషంగా పూజ జరిపారు. పల్లకి ఉత్సవం నిర్వహించారు. భజన సంఘాల వారు హనుమాన్ చాలీసా పారాయణ, భజన కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొల్లిపర సబ్ రిజిస్టర్, సిబ్బందికి సన్మానం



సన్మానిస్తున్న డాక్యుమెంట్ రైటర్స్ , ప్రజలు

కొల్లిపర: సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సోమవారం డాక్యుమెంట్ రైటర్స్ ప్రజలు కలసి కొల్లిపర సబ్ రిజిస్టర్ ఆదినారాయణ రెడ్డిని, ఆఫీస్ సిబ్బందిని శాలువాలతో పుష్పమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్స్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలోని ఆఫీసులలో కొల్లిపర సబ్ రిజిస్టర్ ఆఫీస్‌కు ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఐఎస్‌వో గుర్తింపు రావడానికి కారణమైన సబ్ రిజిస్టర్ ఆది నారాయణరెడ్డి కృషి ఎనలేనిదని కొనియాడారు. కొల్లిపర ఆఫీసును మరింత అభివృద్ధి పథంలో ప్రజల భాగస్వామ్యంతో మరింత ముందుకు తీసుకెళ్లాలని సీనియర్ డాక్యుమెంట్ రైటర్‌లు తమ్మా బసవ పున్నా రెడ్డి, బొందలపాటి గంగాధర్ తదితరులు కోరారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు కోటిరెడ్డి, సుభాని, రమణ శర్మ, బసవ పున్నారెడ్డి, మాధవరెడ్డి, కళ్యాణ్ రెడ్డి, సుబ్బారావు, జానకిరామ్, వీరయ్య, సాంబిరెడ్డి, ఖాజా పాల్గొన్నారు.

హనుమజ్జయంతి మహోత్సవాలు జయప్రదం చేయాలి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి



వీరాంజనేయుడికి జంభీర ఫలార్చన



హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు

తెనాలిటౌన్: స్థానిక షరాఫ్‌బజార్‌లో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుండి జూన్ 1వ తేదీ వరకు జరిగే వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కార్య నిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం దేవాలయం వద్ద కార్యక్రమానికి సంబంధించి బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 30వ తేదీన శ్రీ సీతారామకళ్యాణం, 31వ తేదీన హనుమత్ కల్యాణం జరుగుతాయని తెలిపారు. 1వతేదీ పూర్ణాహుతి ఉత్సవాలతో ముగిస్తామని వివరించారు. అర్చకులు ఆర్‌వీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ 21తేదీ ఉదయం పట్టణ పురవీధుల్లో స్వామివారి శోభాయాత్ర జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శోభాయాత్రలో పాల్గొన భక్తులందరికి స్వామివారి పతకాన్ని ఇవనున్నట్లు చెప్పారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం నేతృత్వంలో ప్రతిరోజు జరిగే హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసమూర్తి ఉన్నారు.

మారీసుపేటలో...

తెనాలి: పట్టణ మారీసుపేటలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో గల వీరాంజనేయస్వామికి ఈనెల 22వ తేదీన హనుమజ్జయంతిని పురస్కరించుకుని లక్ష ప్రదక్షిణముల మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. ఈనెల 12వ తేదీ నుంచి ఆరంభమైన కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపుతున్నారు. భక్తులు తమ శక్తిని అనుసరించి ప్రదక్షిణములు చేస్తున్నారు. అలాగే హనుమాన్ చాలీసా పారాయణంలోనూ సామూహికంగా పాల్గొంటున్నారు.

ఈ క్రమంలో సోమవారం స్వామివారికి జంభీర (నిమ్మకాయలు) ఫలార్చన చేశారు. తదుపరి హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. లలితా గోష్టిచే హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. 20న సామూహిక సింధూరార్చన, 22న హనుమజ్జంతి వేడుకను నిర్వహిస్తారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతుమాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కోశాధికారి వరదా వెంకట శేషగిరిరావు, పేరుబోయిన అంకమ్మరాజు, తాడిపర్తి హరిప్రసాద్ పర్యవేక్షించారు.

ఆదర్శమూర్తి పుచ్చపల్లి సుందరయ్య

గుడివాడ వర్ధంతి సభలో శివసాంబిరెడ్డి



సుందరయ్య చిత్రపటానికి పుష్పాంజలి

తెనాలి: దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని సీపీఎం సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి తెలిపారు. సోమవారం రూరల్ గ్రామం గుడివాడలో ఉపాధి కార్మికులతో కలసి సుందరయ్య 40వ వర్ధంతి సమావేశం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సాంబిరెడి మాట్లాడుతూ కూలి దోపిడీకి వ్యతిరేకంగా దేశంలోనే మొట్టమొదటగా ఆంధ్రప్రదేశ్‌లో పుచ్చలపల్లి సుందరయ్య, వ్యవసాయ కార్మికసంఘం స్థాపించారని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర కావాలని కోరుతూ 1936లో అఖిలభారత కిసాన్ సభకు ఆయన జాతీయ సహాయ కార్యదర్శిగా పనిచేశారని చెప్పారు. తనకు పిల్లలు పుడితే స్వార్థం పెరుగుతుందేమో నన్న ఆలోచనతో సంతానం లేకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నారనీ, అదేమంటే, దేశంలోని బిడ్డలను తమ బిడ్డలు గానే భావించామని చెబుతూ వచ్చారని గుర్తుచేశారు. పార్లమెంటుకు, శాసనసభకు సైకిల్ మీద వెళ్లిన ఆదర్శమూర్తి పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. ఆయన జీవితంలోని అంశాలను నేటి తరం ఆకళింపు చేసుకోవాలని సూచించారు.

రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించండి



వినతిపత్రం తీసుకుంటున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: 29వ వార్డులో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు లేక అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని, వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. కమిషనర్ బండి శేషన్న ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. 9వ వార్డులో మంచినీటి సరఫరా చేయాలని, 30వ వార్డులో ప్రభుత్వ స్థలాన్ని అభివృద్ధి చేయాలని, అదే వార్డులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించాలని, సర్వే సర్టిఫికెట్ ఇప్పించాలని పలువురు వినతిపత్రాలు ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మిపతిరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఇన్‌ఛార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, ఏసీపీ శివన్నాయణ, ఏఈ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ తో పోలీసుల నిఘా



తెనాలిరూరల్: డ్రోన్‌తో పోలీసులు నిఘా పెడుతున్నారు. తెనాలి త్రీ టౌన్ పరిధిలోని మార్కెట్ యార్డు, రెండు గేట్ల మధ్యం ప్రాంతం, చినపరిమి డొంక, పినపాడు, శాంతినగర్, టిడ్కో గృహాల వద్ద సీఐ ఎస్. రమేష్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం డ్రోన్‌ను ఎగురవేసి ఆయా ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలను, రద్దీ ప్రాంతాలను పరిశీలించారు. సంఘ విద్రోహ చర్యలు గంజాయి అరికట్టేందుకు డ్రోన్‌ను వినియోగించనున్నట్టు పోలీసులు తెలిపారు. ఎస్ఐలు ప్రకాశరావు, కరిముల్లా, సిబ్బంది ఉన్నారు.